
క్లుప్తంగా

నేడు లక్ష్మీ నరసింహ స్వామి జయంతి

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం శివరాంపురం వద్ద వెలసిన శ్రీ కపిలగిరి నరసింహస్వామి వారి జయంతి మహోత్సవం మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు తీర్థ బిందె, ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ ప్రతినిధి బొగ్గరపు శేషయ్య తెలిపారు. రాత్రి 8 గంటలకు స్వామివారికి కళ్యాణం, చందనోత్సవం నిర్వహిస్తామని, భక్తులకు అన్న సంతర్పణ ఉంటుందన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీజీబీ ఆర్ఎం


బాధ్యతలు స్వీకరిస్తున్న రఘురాం

మార్కాపురం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్‌గా ఎం.రఘురాం సోమవారం మార్కాపురంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప కేంద్ర కార్యాలయం నుంచి బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసప్రసాద్ కడప ఆర్ఎంగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గిద్దలూరు రూరల్: ఓ వ్యక్తి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్థానిక సెబ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సెబ్ అధికారులు సోమవారం కనుగొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. రాచర్లకు చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి 13 ఆర్మీ మద్యం బాటిళ్లను ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో అదుపులోకి తీసుకుని అతడి పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం బాటిళ్లతో పాటు అతడి బైక్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

ఇతర జిల్లాల నుంచి 225 పోస్టల్ బ్యాలెట్లు

దర్శి: జిల్లాకు చెందిన ఉద్యోగులు ఎన్నికల విధుల్లో వేర్వేరు జిల్లాల్లో ఉండి 225 పోస్టల్ బ్యాలెట్‌లు ఉపయోగించుకున్నట్లు ఆర్వో లోకేశ్వరరావు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ల సీల్డ్ కవర్‌లను జిల్లాలో అన్నీ నియోజకవర్గాలకు సోమవారం అందజేశారు. అందులో భాగంగా దర్శి నియోజకవకవర్గానికి సంబంధించి వివిధ జిల్లాల్లో ఎలక్షన్ డ్యూటీలో ఉన్న 204 మంది, సర్వీస్ ఓటర్లుగా ఉన్న 21 మంది మొత్తం 225 మంది పోస్టల్ బ్యాలెట్‌లను నోడల్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరరావు దర్శి నియోజకవర్గ ఆర్వో లోకేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ బాపట్ల జిల్లా నుంచి అత్యధికంగా 92 పోస్టల్ బ్యాలెట్‌లు, పల్నాడు జిల్లా నుంచి 65, నెల్లూరు జిల్లా నుండి 11, నంద్యాల, ఎన్టీఆర్, విశాఖపట్టణం జిల్లాల నుంచి నాలుగేసి, ఇతర జిల్లా నుంచి ఒకటి, రెండేసి పోస్టల్ బ్యాలెట్‌లు మొత్తం దర్శి నియోజకవర్గానికి 225 అందజేశారని చెప్పారు. సదరు పోస్టల్ బ్యాలెట్‌లు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్‌లను సీల్ వేసి భద్రపరిచినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఆర్మ్‌డ్ గార్డ్ పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా ఉందన్నారు. మొత్తంగా దర్శి నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ ద్వారా 110 మంది, ఓటర్స్ ఆఫ్ ఎలక్షన్ డ్యూటీ (పీఓ,ఏపీఓ,ఓపీఓ, పోలీస్,తదితరులు)వినియోగించుకున్న ఓట్లు 1727 మంది కాగా ఎసెన్సియల్ సర్వీసెస్ ఓటర్లు 25 మంది ఉన్నారన్నారు.

ముమ్మరంగా కార్డన్ సెర్చ్


పాదిలిలో సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

కంభం: పట్టణంలోని అర్బన్ కాలనీలో సోమవారం తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ చేశారు. సీఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో కాలనీలోని ప్రతి గృహాన్ని జల్లెడ పట్టారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో పోలీసుల నిఘా ఉంటుందని ఎవరైనా గొడవలకు, ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఏవైనా ఘర్షణలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట ఎస్సైలు పులి రాజేష్, అనిత, నరసింహ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరులో..

గిద్దలూరు రూరల్: పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులో గల జగనన్న కాలనీలో స్థానిక సీఐ వైవీ సోమయ్య తన సిబ్బందితో కలిసి సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని రెండు బైక్‌లను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిచెర్లలో 12 వాహనాలు సీజ్

కొమరోలు: గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని ఎస్సై మధుసూదన్‌రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తాటిచెర్లలో సోమవారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి డాక్యుమెంట్లు లేని 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సందర్భంగా వివాదాస్పద గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సమయం వరకు ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని సూచించారు. **పాదిలి:** పట్టణంలోని టైలర్స్ కాలనీలో సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పాదిలి ఎస్సై కోటయ్య , కొనకనమిట్ల, తర్లపాడు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది సోమవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేసి అనుమానితులను విచారించడంతో పాటు సరైన పత్రాలు లేని 26 బైక్‌లను సీజ్ చేశారు.

మార్కాపురంలో 17 వాహనాలు సీజ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఏకలవ్య కాలనీ, ఎస్టేట్ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు ఎస్సైలు అబ్దుల్ రహిమాన్, వెంకటేశ్వరనాయక్, ఏఎస్ఐలు, సిబ్బంది ఇంటింటినీ తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు.


కంభంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు


గిద్దలూరులో గృహాల్లో తనిఖీ చేస్తున్న సీఐ


వసంతోత్సవ కార్యక్రమం

వేడుకగా చెన్నకేశవుని వసంతోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి విగ్రహాలను ఉంచి ఉత్సవం నిర్వహించారు. మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవ రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


స్వామివారి గ్రామోత్సవం

మంగళవారం ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

గిద్దలూరు రూరల్: ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ మండలంలోని ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు శాంతి భద్రతలకు సహకరించాలని స్థానిక సీఐ వైవీ సోమయ్య అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో అన్ని రాజకీయపార్టీ నాయకులకు సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇరుపార్టీల వారు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం అవగాహన లేని కొందరు అల్లర్లకు పాల్పడటంతో అనవరసంగా కేసుల్లో చిక్కుకుని వారి జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. అలాంటి సంఘటనలు జరగకుండా ప్రజలకు చైతన్య పరిచేందుకు పోలీసు యంత్రాంగం పట్టిష్టంగా పనిచేస్తోందన్నారు. ఎక్కడే కాని చిన్న


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సోమయ్య

పాటి ఘర్షణలు జరగనివ్వకుండా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందన్నారు. పోలీసులకు సహకరిస్తూ ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీ నాయకుడిపై ఉందన్నారు. ఎస్సై తోట వెంకటేశ్వర్లు, ఏఎస్సై జింకా రంగయ్య, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బిజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం


మార్కాపురం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


గిద్దలూరు రూరల్: విద్యార్థులకు విద్యను బోధిస్తున్న సిబ్బంది


బేస్తవారిపేట: చిత్రలేఖనంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మార్కాపురం: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోందని గ్రంథపాలకుడు శివారెడ్డి సోమవారం తెలిపారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసంతో పాటు చదవడం, రాయడంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు క్యారమ్స్‌తోపాటు పుస్తక పఠనం, పద్యాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

తలిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి పంపాలని కోరారు.

విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం చెస్, వైకుంఠపాళి, ఖోఖో, కుర్చీల ఆట వంటి క్రీడలతో పాటు విద్యను బోధించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయంలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమంలో పాల్గొని వారిలో దాగి ఉన్న విద్యానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదివి వినిపించడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ తరగతులు, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్‌లపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వేసవిలో ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను విజ్ఞాన శిబిరం కార్యక్రమానికి పంపాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అధ్యాపకులకు సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: శ్రీవివేకానంద కళాశాలలో 1995–98 సంవత్సరాల మధ్య డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పట్టణంలోని అభిలాష ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు విద్యాబోధన చేసిన అధ్యాపకుడు, జనవిజ్ఞాన వేదిక నాయకుడు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పటి జ్ఞాపకాలతో విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యను బోధించిన అధ్యాపకులైన రాఘవరావు, బాలిరెడ్డి, భాస్కర్ రావులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మధు, ప్రసాద్, పాండు, నాగమణి, సాయిలక్ష్మి, రంగేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలగా జెడ్పీ హైస్కూల్

బేస్తవారిపేట: బేస్తవారిపేట మండలంలో ఏడు జెడ్పీ హైస్కూల్స్, మూడు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత ఇంటర్ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకున్న మార్పులతో ఇంగ్లిష్ మీడియంలో అన్నీ వసతులతో మండల కేంద్రంలో జెడ్పీ బాలుర హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలలో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు కేటాయించారు. కార్పొరేట్ కళాశాలల్లో లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌తో విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకున్నారు. బేస్తవారిపేట టౌన్‌లో విశాలమైన ఆటస్థలం, నూతన భవనాలు, వ్యక్తిత్వ వివాస శిక్షణ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యను అందించేందుకు ఏర్పాటు చేశారు. బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్లో 98 మంది, బాలికల హైస్కూల్లో 87 మంది, బేస్తవారిపేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 461 మంది విద్యార్థులు ఈ ఏడాదిలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు.


జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన జెడ్పీ బాలుర హైస్కూల్

అడ్మిషన్ల కోసం సంప్రదించాలి:




పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో చేరాలనుకుంటే అడ్మిషన్ తీసుకోవాలి. కో ఎడ్యుకేషన్, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం అన్నీ వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

– ఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్

ముటుకులలో 20 బైక్‌ల సీజ్

పుల్లలచెరువు: మండలంలోని ముటుకులలో సీఐ రాములునాయక్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేశారు. సరైన పత్రాలు సక్రమంగా లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట పుల్లలచెరువు ఎస్ఐ ఫిరోజ్‌ఫాతిమా, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో మెండుగా ఉపాధి పనులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పుల్లలచెరువు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తూ వేతనాలు సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు జోరుగా జరుగుతున్నాయి. అడిగిన వారికి పని కల్పిస్తూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ, టీఏ, ఈసీ, ఎఫ్ఏలు అందుబాటులో ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయగానే వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. కూలీలకు ప్రతి వారం నగదు జమ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

8 లక్షల పనిదినాలు లక్ష్యం

పుల్లలచెరువు మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో 2024–25 సంవత్సరానికి 8,63,000 పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. కూలీలకు రోజుకు రూ.296 వేతనం వచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ లక్ష్యాన్ని సమయానికి పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలో 4,21,000 పని దినాలను పూర్తి చేసినట్లుగా ఏపీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూలీలు ఉదయం 7 గంటల నుంచి 10.30 గంటల వరకు పనిచేస్తున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనికల్పిస్తున్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ పనిచేసుకోవచ్చు.

అక్రమాలకు తావు లేకుండా..

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీలకు హాజరు వేస్తున్నారు. గతంలో మస్టర్ మాన్యువల్ వేస్తుండడంతో బోగస్ హాజరు ఉన్నట్లుగా విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజు రెండు ఈ సిస్టం ద్వారా ఫొటోలు తీయడంతో అక్రమాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కూలీల సంఖ్యను పెంచుతాం

ఈ ఆర్థిక సంవత్సరంలో 8 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించాం. దీన్ని పూర్తి చేసిన అనంతరం సంఖ్యను పెంచుతాం. ప్రస్తుతం రోజుకు 8,700 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. వారి సంఖ్యను పెంచేలా చర్యలు చేపడతాం. కూలీలకు సంబంధించిన వేతనాన్ని వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నాం.

– కె.శ్రీనివాసరెడ్డి, ఏపీఓ

విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని కొత్రపాటివారిపాలెంలో కోటా పెదశేషయ్యకి చెందిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన కోటా పెద శేషయ్య పశువులను మేపుకునేందుకు సోమవారం ఉదయం పొలం వెళ్లాడు. సాయంత్రం వేళలో ఇంటికి వచ్చే సమయంలో పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో గేదెలకు తీగలు తగిలాయి. ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. గేదెలకు విత్యుత్ షాక్ తగిలిన సమయంలో తాను కొద్దిపాటి షాక్‌కి గురయ్యానని ఆందోళన వ్యక్తం చేశాడు. కొంచెం తేరుకొని వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు తన దగ్గరకు వచ్చారన్నారు. ఇదిలా ఉంటే గత నెల రోజుల నుంచి విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో నేడు గేదెలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు విద్యుత్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గేదెల కళేబరాలు